www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శుక్రవారం
16 మే 2025

**విలేఖరులు కావలెను**


కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు
జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను.
తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు..
సమకాలీన రాజకీయాలు, సామాజిక
అంశాలపై అవగాహన ఉండి..
రాయగల వారికి 'కలంజ్యోతి'
సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003



### సరస్వతి పుష్కరాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి
### కాళేశ్వరం అభివృద్ధి కోసం రూ.200 కోట్లు అయినా కేటాయించేందుకు సిద్ధం

# పర్యాటక క్షేత్రంగా కాళేశ్వరం

**ముక్తీశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం**
**సీఎం రేవంత్‌రెడ్డి**





కలంజ్యోతి, జయశంకర్ భూపాలపల్లి : కాళేశ్వరం ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సరస్వతి పుష్కరాల్లో భాగంగా హారతి కార్యక్రమంలో సీఎం, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కాళేశ్వరం అభివృద్ధి కోసం రూ.200 కోట్లు అయినా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సరస్వతి మిగతా 4లో



## కలెక్టర్‌తో కేంద్ర బృందం భేటీ

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించి కేంద్రీయ విద్యాలయ దక్షిణ భారత విభాగం డిప్యూటీ కమిషనర్ మంజునాథం, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ కలెక్టర్ అభిలాషను కలెక్టరేట్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాసర మండలంలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకు అవసరమైన స్థలాలను బృందం పరిశీలించిన విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. వసతి, మౌలిక సదుపాయాలపై చర్చించారు. కేంద్ర విద్యాలయ నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తించేం దుకు భౌగోళిక పరిస్థితులు, కమ్యూనికేషన్ సదుపాయాలు, భవిష్యత్ అవసరాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. సమావేశంలో ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి పాల్గొన్నారు.



## అకాల వర్షంతో తడిసి ధాన్యం

**కలంజ్యోతి, నర్సాపూర్ :** నియోజకవర్గంలో హత్నూర మండల్ గుండ్లమ చునూర్ గ్రామంలో తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఆరుబయట ఉన్న ధాన్యం మొత్తం తడిసి పోవడంతో రైతులు నష్టపోయి దినస్థితిలో ఉన్నారు. ధాన్యం తూకానికి సిద్ధంగా ఉన్న ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సరైన సమయంలో లేబర్ లేకపోవడం, వాహనాలు రాకపోవడం కొనుగోళ్లు నిలిచిపోయాయన్నారు. దీంతో వర్షానికి ధాన్యం తడిచినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి, తడిసిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని అన్నదాత వేడుకుంటున్నారు.

## పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

**కలంజ్యోతి, వరంగల్ :** ఐదు నెలల నుండి జీతాలు రాకపోవడంతో మైనార్టీ స్కూల్ లలో పని చేసే దోబీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీతల విషయమై పలుమార్లు స్కూల్ చుట్టూ తిరిగిన ఫలితం లేకపోయిదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఆయా మైనార్టీ స్కూల్లో పని చేసే దోబీలకు డిమాండ్ చేస్తున్నారు. జూన్ లో పాఠశాలలు పున ప్రారంభం కాబోతున్నాయని, ఇప్పటికైనా దోబీల పెండింగ్ జీతాలను విడుదల చేయాలని లేనిపక్షంలో తిరిగి విధుల్లో చేరేది లేదని స్పష్టం చేశారు.

## యువకుడి అనుమాదాస్పద మృతి

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని కొండగట్టులోని మారుతి టౌన్ షిప్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గురువారం అనుమానస్పదంగా యువకుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం..



కొడిమెల మండలంలోని రామ్ సాగర్ కు చెందిన శేఖర్ గా గుర్తించారు. ఘటన స్థలానికి సీఐ నీలం రవి, ఎస్సై నరేష్ కుమార్ చేరుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



# హైదరాబాద్‌లో ఈడీ దాడులు

### వైఎస్ రెడ్డి ఇంట్లో సోదాలు

### భారీగా దొరికిన నగదు, బంగారం

**కలంజ్యోతి, హైదరాబాద్:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు హైదరాబాద్ లో మరోసారి సోదాలు చేపట్టారు. ముంబై టౌన్ ప్లాన్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి లక్ష్యంగా దాడులు జరిపారు. హైదరాబాద్, ముంబైలోని మొత్తం 13 చోట్ల ఏకకాలంలో విస్తృతంగా దాడులు చేపట్టారు. ఆయన ఇంట్లో దాదాపు రూ.23.5 కోట్ల విలువైన బంగారం, డైమండ్స్, రూ.8.6 కోట్ల విలువైన నగదు స్వాధీనం చేసుకున్నారు. 41 భవనాలకు అక్రమ అనుమతులు ఇచ్చారని ఆయనపై కేసు నమోదైంది. బిల్డర్స్ తో కుమ్మక్కై అనధికారికంగా అనుమతులు మంజూరు చేసి డబ్బులు దండుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఈడీ అధికారులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజుల క్రితమే ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రమోషన్స్ విషయంలో సినీ నటుడు మహేష్ బాబుపై కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చారు. బ్రాండ్ ప్రమోషన్ కోసం మహేష్ బాబు రూ.5.9 కోట్లు తీసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. సదరు కంపెనీ చేసిన లావాదేవీలన్నీ.. అక్రమ లావాదేవీలే అని ఈడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే మహేష్ బాబుకు నోటీసులు జారీ చేశారు.



# తరుగు పేరుతో ఇబ్బందులు కలిగించొద్దు

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతిపత్రం

**కలంజ్యోతి, నిర్మల్ :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలు పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. అయితే ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత రైస్ మిల్లర్లకు పంపితే మిల్లర్లు తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రైతులను రైస్ మిల్లర్లకు పిలిపించి ధాన్యంలో కోత పెడుతున్నారని ఆరోపించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వెంట వెంటనే ధాన్యాన్ని తూకం వేసి మిల్లర్లకు పంపించాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# మత్తు మాటున ప్రాణాంతక ఇంజెక్షన్లు

## నలుగురి అరెస్ట్

### ఎస్పీ జానకి షర్మిల




**కలంజ్యోతి, నిర్మల్ :** మత్తు పదార్థాలకు, డ్రగ్స్ కు బానిసైన వారికి ప్రాణాంతక మత్తు ఇంజెక్షన్లు ఇస్తూ డబ్బు సంపాదిస్తున్న నలుగురిని అరెస్టు చేశామని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. గురువారం తమ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. షేఖ్ ఫర్దిన్, పర్వేజ్, చౌహాన్ గోవింద, మహమ్మద్ అబ్దుల్ డానీష్ ఈజీమనీ కోసం కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారన్నారు. మిడాజోలం అనే మత్తు ఇంజక్షన్ ను యువకులకు ఇస్తూ వారిని మత్తుకు బానిసలుగా చేసి ఎక్కువ డబ్బు వసూలు చేసేందుకు గ్రూపుగా ఏర్పడ్డారని తెలిపారు. ఆసుపత్రుల్లో రోగులకు అనెస్తీషియాకు ఇచ్చే ఇంజక్షన్ ను ఇందుకు ఎంచుకున్నార న్నారు. నిందితుల్లో ఒకరు షేక్ ఫర్దిన్ ల్యాబ్ టెక్నీషియన్ గా మూడేళ్లుగా పనిచేస్తున్నాడ న్నారు. తనకున్న పరిజ్ఞానంతో స్నేహితులైన పర్వేజ్, చౌహాన్ గోవింద, మహమ్మద్ అబ్దుల్ డానీష్ లతో కలిసి ఈ దందా చేపట్టారన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడ్డ వారి వివరాలను వీరు సేకరించారన్నారు. షేఖ్ ఫర్దిన్, చౌహాన్ గోవింద, మహమ్మద్ అబ్దుల్ డానీష్ పట్టణంలోని వివిధ ఆసుపత్రుల నుంచి ఇంజక్షన్లను, సిరంజీలను సేకరించారన్నారు. కాగా, మహమ్మద్ ఫర్వేజ్ మత్తుకు బానిసైన వారిని దగ్గరికి వెళ్ళి వారికి స్థానిక మార్కెట్ కమిటీ పరిసరాల్లో ఇంజెక్షన్ చేసేవారన్నారు. ఒక్కో ఇంజెక్షన్ కు రూ.500 చొప్పున తీసుకునేవారని, ఈ వ్యవహారం దాదాపు ఏడాది కాలంగా సాగుతోందని తెలిపారు. తగిన సమాచారంతో వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుండి 26 ఇంజక్షన్లను, 10 సిరంజీలు, 4 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ కు పంపినట్లు వివరించారు. వీరిలో ఒకరు ఎక్స్ రే టెక్నీషియన్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు. మరొకరు విద్యార్థి అని పేర్కొన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ నరేష్, కానిస్టేబుల్ సాయి, నవీన్ ను ఎస్పీ అభినందించారు. ఈ క్రమంలో మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇలాంటి వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రోడ్డు పనులు ప్రారంభించిన కొలను

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** గాజులరామారం డివిజన్ పరిధిలోని కైసర్ నగర్ లో సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి కాలనీ వాసులు గత తీసుకెళ్లారు. దీంతో వారి సమ్యసలపై కొలన్ స్పందించి, నియోజకవర్గ ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరు చేయించారు. నిధులు మంజూరు కావడంతో రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. తమ ఇబ్బందులను అర్థం చేసుకుని రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన కొలను బస్తీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు పెరిక శివ, డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ షఫీ, సమీర్ ఖాన్, ఐ మధు, ఎండీ అజీమ్, ఎండీ ఇమ్రాన్, ఆసిఫ్ ఖాన్, శారీఫ్, జఫ్ఫార్, మహేందర్, ఎండీ ఆసిఫ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.







# బాసర ప్రధాన అర్చకుడిపై దాడి

## ప్రాణహాని ఉందంటూ పోలీసులను ఆశ్రయించిన సంజీవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా బాసర శ్రీసరస్వతీ ఆలయంలో ప్రధాన పూజారి సంజీవ్ పై బుధవారం ఉదయం దాడి జరిగింది. ఇటీవల వివాదాలకు దారితీసిన వేదభారతి ఎదుటే ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బాసర అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి రోజూ లాగే బుధవారం బాగా పొద్దుపోయాక వాకింగ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో వేద భారతి సంస్థ ముందు నుంచి వెళుతుండగా వేదభారతి స్వామీజీ అనుచరుడు నూకం రామారావు వెనుక నుంచి వచ్చి కొడుతూ దుర్భాషలాడాడని పూజారి ఆరోపించారు. నువ్వు దేవాలయంలో పూజారిగా ఎలా కొనసాగుతావో చూస్తానంటూ చేయి చేసుకున్నాడని పేర్కొన్నారు. దీంతో 100 కు డయల్ చేసేందుకు యత్నించగా కాల్ కలవకపోవటంతో తప్పించుకుని ఇంటికి చేరుకున్నానని వివరించారు. ఈ మేరకు తనకు ప్రాణహాని ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**వివాదాలమయం వేదభారతి..**

వేదభారతి సంస్థను నిర్వహిస్తున్న వేద విద్యానందస్వామిపై, సంస్థపై పలు వివాదాలు నెలకొన్నాయి. ఇటీవలే సంస్థలో వేదవిద్యను అభ్యసిస్తున్న ఒక విద్యార్థి తీవ్రంగా గాయపడ్డారు. కాగా, ఈ ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మరో విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ ఘటనలపై విచారణ కొనసాగుతుండగానే సంజీవ్ పూజారిపై కూడా దాడులు జరగడం గమనార్హం.




# గొర్లు, మేకల దొంగలు అరెస్ట్

**కలంజ్యోతి , మల్యాల :** జిల్లాలో పలుచోట్ల గొర్లు, మేకలను దొంగిలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు గురువారం సీఐ నీలం రవి తెలిపారు. కేసు వివరాలను గురువారం ఎస్ఐ నరేష్ కుమార్ కలిసి వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్, ఒక ఆటోలో గొర్లు ఉన్నాయని, వారిని ఆపి విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. గత నాలుగు నెలల నుంచి జిల్లా చుట్టుపక్కల మండలాలు, గ్రామాల్లో అర్ధరాత్రి సమయంలో తిరుగుతూ గొర్లు, మేకలను దొంగలించి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన డబ్బులను పంచుకొని జల్సాలకు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర మండలాలతో పాటు మల్యాల మండలంలోని మద్దుట్ల, ఓబులాపూర్ గ్రామాల్లో మేకలను, గొర్లను దొంగిలించినట్లు నేరం ఒప్పుకోవడంతో నిందితులు మద్దవేణి అనిల్, మహమ్మద్ మోసిన్, వెంకటేష్ పై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు.

4 కలంజ్యోతి
శుక్రవారం 16.05.2025 General News

# మహిళలపై సర్కార్ అవమానకర వైఖరి

## మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ



**కలంజ్యోతి, హైదరాబాద్:** తెలంగాణ ఆడబిడ్డలతో కాళ్లు కడిగించడమంటే ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే ఎంపీ డీకే అరుణ అన్నారు. ‘ ములుగు జిల్లా రామప్ప దేవాలయంలో మిస్ వరల్డ్ పోటీ భాగస్వాముల పర్యటన సందర్భంగా జరిగిన ఘటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాను. విదేశీ సుందరీమణుల కాళ్లకు నీళ్లు పోసి, తుడిపించే బాధ్యతను ప్రభుత్వం తెలంగాణ యువతిపై, మహిళలపై మోపడం అనేది అత్యంత బాధాకరం, అవమానకరం. విదేశీ యువతుల పాదాల వద్ద తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం తాకట్టు పెట్టడం బాధాకరం. మన సాంప్రదాయాలను గౌరవించాలి కాని అవమానించడం సరికాదు. "అతిథి దేవో భవః" అనే భారతీయ సంస్కృతిని తప్పుడు రూపంలో ప్రదర్శిస్తూ స్థానిక మహిళలను సేవకుల్లా చూపించడాన్ని బీజేపీ ఖండిస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సంఘటనపై వెంటనే వివరణ ఇవ్వాలి. ఇది తెలంగాణ సాంస్కృతిక గౌరవాన్ని తుడిచిపెట్టే చర్య. ప్రభుత్వం ఈ ఘటనకు సంబంధించిన స్పష్టమైన సమాధానం ఇవ్వాలి’ అని అన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆడబిడ్డలకు అవమానం

## బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి



**నా తెలంగాణ, హైదరాబాద్:** ప్రపంచ అందగత్తెల పోటీ పేరుతో తెలంగాణ మహిళలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం వాళ్లను అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి మండిపడ్డారు. విదేశీ మహిళల కాళ్లను ఆడబిడ్డలతో కడిగించడాన్ని ఖండిస్తూన్నామన్నారు. ‘ ప్రపంచ అందగత్తెల పోటీ పేరుతో తెలంగాణ మహిళలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం కాంగ్రెస్ ప్రభుత్వ బానిసత్వానికి, మహిళల పై ద్వేష భావానికి నిదర్శనం. ఇది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవం మీద దాడే. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మాభిమానాన్ని అందాల పోటీకి వచ్చిన సుందరీమణుల పాదాల దగ్గర పెట్టేలా ప్రభుత్వం వ్యవహరించడాన్ని బీజేపీ మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తోంది. అందాల పోటీల్లో భాగంగా రామప్ప దేవాలయ సందర్శనకు వచ్చిన సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడపడుచుల చేత కడిగించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. దళిత, గిరిజన మహిళల పట్ల ప్రభుత్వ తీరు మరింత అవమానకరం. ఈ చర్యకు ప్రభుత్వం ఈ దారుణ ఘటనకు తక్షణమే క్షమాపణ చెప్పాలి. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులపై, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి. తెలంగాణ గర్వించే సమ్మక్క సారలక్క పుట్టిన ప్రాంతంలో ఇలాంటి అవమానం జరగడం బాధాకరం. ప్రతి ఒక్కరి గౌరవం తప్పనిసరి. అందాల పోటీలకు వచ్చిన విదేశీ సుందరీమణుల గౌరవం కూడా చాలా ముఖ్యమే. కాని మన సొంత ఆడపడుచుల గౌరవం తగ్గకుండా చూసుకోవాలి. మహిళల ఆత్మగౌరవం పరిరక్షణకే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా ఉండాలి. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, మన సంస్కృతిని, మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రభుత్వం బాధ్యత’ అని చెప్పారు.



# పర్యాటక క్షేత్రంగా కాళేశ్వరం



▸▸ మొదటిపేజీ తరువాయి

పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని సీఎం అభినందించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం తొలిసారిగా టెంట్ సిటీ ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా రానున్నాయని చెప్పారు. వచ్చే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు కాళేశ్వరం క్షేత్రానికి వచ్చేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించే అదృష్టం తనకు కలగనుందని సీఎం వెల్లడించారు.

**గణపతి పూజతో..**

గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతి నది ఉద్భవించిన ప్రాంతంలో గురువారం ఉదయం 5.44 గంటలకు సరస్వతి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. గోదావరి పుష్కరాల సమయంలో (వీఐపీ ఘాట్) సరస్వతి ఘాట్ లో సరస్వతి నది పుష్కరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,



ఆయన సతీమణీ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హై కోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతి పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హజరయ్యారు. విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరుడికి తొలి పూజలు చేసిన తరువాత సరస్వతి నది పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పరణ చేశారు.

**సరస్వతీ మాత విగ్రహావిష్కరణ..**

సరస్వతి పుష్కరాల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరానికి విచ్చేశారు. తొలుత త్రివేణిసంగమం వద్ద సరస్వతీ ఘాట్‌ను తదనంతరం పది అడుగుల ఎత్తైన ఏకశిలాసరస్వతీ విగ్రహాన్ని మంత్రులతో కలిసి ప్రారంభించారు. అనంతరం త్రివేణి సంగమంలో సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు.

**ముక్తీశ్వరస్వామి దర్శనం..**

కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సీఎం, మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో రేవంత్‌రెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. వేదపండితులు రేవంత్ రెడ్డికి ఆశీర్వచనాలు అందించారు. దేవాదాయశాఖ తరఫున సరస్వతి విగ్రహాలను సీఎం సహా మిగతా అతిథులకు బహూకరించారు. తొగుట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీతో రేవంత్ రెడ్డి ఆప్యాయంగా కాసేపు ముచ్చటించారు.

Cinema
కలంజ్యోతి
శుక్రవారం 16.05.2025



# నాకు దానిపై ఇంట్రెస్ట్ లేదు

హీరోయిన్ తాప్సీ పన్ను టాలీవుడ్‌లో గ్లామరస్ రోల్స్ చేసి.. బాలీవుడ్‌లో మాత్రం కంటెంట్ ఉన్న సినిమాలు చేసి సక్సెస్ సొంతం చేసుకుంది. షారుఖ్ ఖాన్‌తో నటించాలనుకున్న కలను నెరవేర్చుకుంది. అయితే ఓ సారి 'కాఫీ విత్ కరణ్' షోలో ఎందుకు పాల్గొనలేదు అనే ఓ యాంకర్ ప్రశ్నకు కరణ్‌ను రోస్ట్ చేసే ఆన్సర్ ఇచ్చింది. 'నా సెక్స్ లైఫ్ అంత ఇంట్రెస్టింగ్‌గా ఉండదు' అని సమాధానమిచ్చి.. ఆ షో కేవలం ఆ విషయం గురించి మాట్లాడేందుకేనని ఇండైరెక్ట్‌గా చెప్పేసింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ మరోసారి ట్రెండింగ్‌లోకి రాగా కుర్ర హీరోయిన్ కామెంట్స్‌కు ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. పెళ్లి జరిగి రెండేళ్లు కూడా కాలేదు అప్పుడే అంత మాట అనేసింది ఏంటబ్బా అని ఆశ్చర్యానికి గురవుతున్నారు. కానీ అసలు విషయం తెలిసి నవ్వుకుంటున్నారు. కాఫీ విత్ కరణ్ షో కార్యక్రమంపై సెటైర్ అని ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు. మొత్తానికి సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన తాప్సీ ఈ విధంగా ట్రెండ్ అవుతోంది.